క్లుప్తంగా

20న మండల సర్వసభ్య సమావేశం

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 20న ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేశ్ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమౌతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చెరువుల నిర్మాణానికి ప్రతిపాదనలు

బోథ్: బోథ్ నియోజవర్గంలో 18 కొత్త చెరువులు, 24 చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో నీటిపారుదల చీఫ్ ఇంజనీర్ మురళీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వానికి పంపించిన చెరువుల ప్రతిపాదనలకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని కోరారు.

బడీడు పిల్లలను బడికి పంపాలి

ఆదిలాబాద్‌రూరల్: బడీడు పిల్లలను బడికి పంపాలని హెచ్‌ఎం శశికళ అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఎస్‌ఎంసీ సమావేశం నిర్వహించారు. అనంతరం బడిబాట నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్‌కు దీటుగా వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాంసి: భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. భీంపూర్, ధనోరా, కరంజి(టి) గ్రామాల గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. గైనకాలజిస్ట్ కౌస్తూభా స్కానింగ్‌తో పాటు రక్తపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి విజయసారథి, హెచ్ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, స్టాఫ్‌నర్స్ హీరాబాయ్, ఏఎన్ఎంలు సంధ్యారాణి, భాగ్యవతి, రాందాస్ పాల్గొన్నారు.

జొన్న కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో చేపట్టిన జొన్నల కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సొసైటీ సీఈవో కేశవ్ తెలిపారు. మార్కెట్‌యార్డులో జొన్న నిలువలు పేరుకుపోవడంతో కొనుగోలు రెండు రోజుల పాటు నిలిపివేశామన్నారు. 17, 18తేదీల్లో కొనుగోళ్లు ఉండవని పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రం శనివారం ఒకరోజు బంద్ ఉంటుందని పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జొన్న పంట నిల్వ ఉండడంతో నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రథయాత్ర జయప్రదం చేయండి


కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24న చేపడుతున్న శ్రీజగన్నాథ రథయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఇస్కాన్ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి, రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు పట్టణంలోని మధుర జిన్నింగ్ నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు ప్రేమనర్తన్ దాస్, గిరివార్ దాస్, పూర్ణకృష్ణ, శ్రీకాంత్ పత్తివార్, మితున్ బస్వేశ్వర్, ప్రశాంత్, శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

లాసెట్‌లో జిల్లా వాసి ప్రతిభ

ఎదులాపురం: లాసెట్–2023 ఫలితాల్లో ఇచ్చోడ మండలం అడెగామ (కె) గ్రామానికి చెందిన క్లెం వెన్నెలరెడ్డి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో 165వ ర్యాంకు కైవసం చేసుకుంది. ఈమెను పలువురు అభినందించారు.

భూమిపూజ

తాంసి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే డ్రయినేజీ నిర్మాణానికి సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కల్యాణ్, ప్రసాద్, దేవారెడ్డి, విలాస్, రామన్న యాదవ్, హన్మండ్లు పాల్గొన్నారు.

ఢీ అంటే ఢీ..

- బోథ్ బీఆర్ఎస్‌లో ఆసక్తికర పరిణామాలు
- జెడ్పీటీసీ అనిల్ జాదవ్ బలప్రదర్శన
- టిక్కెట్ విషయంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో ఢీ
- అట్టహాసంగా పుట్టిన రోజు వేడుకలు


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ జనార్దన్

సాక్షి,ఆదిలాబాద్: ఇన్ని రోజుల పాటు అంతర్గతంగా ఉన్న ఆంకాక్షను బీఆర్ఎస్ నేతలు పూర్తిస్థాయిలో బహిరంగ పరుస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్న వారు బలప్రదర్శన ద్వారా సత్తా చాటాలని చూస్తున్నారు. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ బోథ్ నుంచి ఈసారి బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. టిక్కెట్ విషయంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో ఢీ అంటే ఢీ అంటున్నాడు. తన పుట్టిన రోజున ఆయన నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించడం, కార్యకర్తలు, అభిమానుల మధ్య వేడుకలు జరుపుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నాడు ప్రత్యర్థి.. నేడు ఒకే పార్టీ..

కిందటి ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి రాథోడ్ బాపురావు పోటీ చేయగా.. ఇండిపెండెంట్ అభ్యర్థిగా అనిల్ జాదవ్ బరిలో నిలిచారు. రాథోడ్ బాపురావు గెలిచినప్పటికీ స్వతంత్ర అభ్యర్థిగా 27 వేలకు పైగా ఓట్లు నియోజకవర్గంలో అనిల్ జాదవ్ సాధించారు. తద్వారా ఇక్కడ పట్టు నిలుపుకుంటూ వస్తున్నాడు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ టిక్కెట్ ఆశిస్తున్నాడు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఆయనకు సపోర్టు చేస్తున్నారు. ఈ పరిణామాలు రాథోడ్ బాపురావుకు రుచించడం లేదు. అధిష్టానం అండదండలు అనిల్ జాదవ్‌కు ఉన్నాయనే ప్రచారం పార్టీలో జోరుగా సాగుతోంది. గతంలో అనిల్ జాదవ్ కాంగ్రెస్ నుంచి కూడా బోథ్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాలని ఉవిళ్లూరుతున్నారు.

బల ప్రదర్శన..

అనిల్‌జాదవ్ తన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అట్టహాసంగా వేడుకలు నిర్వహించారు. దీనికి నియోజకవర్గంలోని 9 మండలాల నుంచి కార్యకర్తలు, అభిమానులు, తరలిరావడం ప్రాధాన్యత సంతరించుకుంది. నేరడిగొండ నుంచి ఇచ్చోడ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఇచ్చోడలో ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌లు ఆయన వెంట ర్యాలీలో కొనసాగారు. అనంతరం భారీ జనసమూహం మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ వ్యవహారం మొత్తం రాథోడ్ బాపురావుకు చెక్ పెట్టేలా సాగింది. ఇదిలా ఉంటే ఇచ్చోడలో డీజే విషయంలో పోలీసులు అడ్డుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

అనిల్‌కు మంచి భవిష్యత్ ఉంది


జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

- ఎమ్మెల్యే జోగు రామన్న
- ఘనంగా అనిల్‌జాదవ్ జన్మదిన వేడుకలు

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గంలో జనాధారణ ఉన్న అనిల్‌జాదవ్‌కు మంచి భవిష్యత్ ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఇచ్చోడలో అనిల్‌జాదవ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అనిల్ పట్ల పార్టీ అధిష్టానం ఆలోచిస్తుందన్నారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ.. అనిల్ జాదవ్ రానున్న రోజుల్లో మరింత ప్రజాసేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇచ్చోడ, బోథ్ ఎంపీపీలు ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, తాంసి, భీంపూర్ జెడ్పీటీసీలు తాటిపెల్లి రాజు, కుమ్ర సుధాకర్, సర్పంచులు తిరుమల్‌గౌడ్, ముండేపాండురంగ్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ..

భారీ ర్యాలీతో మండల కేంద్రానికి చేరుకున్న అనిల్ జాదవ్ కుమురం భీం, అంబేద్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు క్రేన్ సహాయంతో అనిల్‌జాదవ్, జోగు రామన్న, రాథోడ్ జనార్దన్, తుల శ్రీనివాస్‌లను గజమాలతో సత్కరించారు.

నేరడిగొండ: నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం నుంచి ఇచ్చోడ వరకు తన అనుచరులు, అభిమానులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కేటీఆర్ సన్నిహితుడు జాన్సన్ నాయక్ అనిల్ జాదవ్ ఇంటికి వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నేరడిగొండ వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి గ్రామస్తులతో కలిసి వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓవర్గం నేతలు ర్యాలీని అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ జనసందోహాన్ని నిలువరించలేకపోయింది. ర్యాలీ అనంతరం పలువురిపై కేసులు అయినట్లు తెలుస్తోంది. అనిల్ జన్మదిన వేడుకలను అడ్డుకునే ప్రయత్నం చేసిన నేతలు అదే పార్టీకి చెందిన వారు కావడం చర్చనీయాంశమైంది. స్వచ్ఛందంగా ప్రజలు రావడం జీర్ణించుకోలేకనే ఇలాంటి పనులు చేశారని అనిల్ నేతలు ఆరోపించారు.

బాధిత కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం చేస్తున్న సాకటి దశరథ్

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: ఈనెల 3న సాక్షిలో ప్రచురితమైన 'ఇంటి పెద్దదిక్కు..ఆ చిన్నారి' కథనానికి బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్ స్పందించారు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. గత నెల 14న 'ఆదుకుందాం.. బ్రతుకునిద్దాం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనం చూసి కనుగుట్ట గ్రామానికి చెందిన నల్ల సతీశ్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థికసాయం అందజేశారు.

కేసులు ఎత్తివేయాలి

ఎదులాపురం: ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు 2022 ఆగస్టులో ప్రజాపక్ష మేధావి ప్రొఫెసర్ జి.హరగోపాల్, కామ్రేడ్ సంధ్య, విమలక్క, తదితర 152 మంది ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. మావోయిస్టు పార్టీకి అనుబంధంగా ఉండే సంఘాల్లో పని చేస్తూ రాజద్రోహానికి పాల్పడుతున్నారని పేర్కొనడమే కాకుండా, వీరిని కఠినంగా శిక్షించాలని అక్రమంగా, తప్పుడు కేసులను బనాయించారని మండిపడ్డారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం స్పందించాలని కోరారు.

'రైతులను మోసం చేస్తే చర్యలు'

బేల: నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని జైనథ్ సర్కిల్ సీఐ కోల నరేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వ్యవసాయ, పోలీసుశాఖల ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు నకిలీ విత్తనాలు, అధిక ధరలకు ఎరువులు అమ్మితే పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి వెండి విశ్వామిత్ర, ఎస్సై కృష్ణకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

తపాలాశాఖ పథకాలపై అవగాహన

తలమడుగు: తపాలాశాఖలో ప్రవేశపెట్టిన పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచీ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాస్, భరత్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో తపాలశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, సుకన్య సమృద్ధి, ఆర్‌డీ, ప్రమాద బీమా గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాంచీ పోస్ట్‌మాస్టర్, మల్లేశ్, వికాస్‌రెడ్డి, వంశీ, దీపక్ పాల్గొన్నారు.

సంక్షిప్తం..

ఉద్యమకారులకు గుర్తింపు

ఇచ్చోడ: తెలంగాణ ఉద్యమకారులను బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తిస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యురాలు కుస్రం నీలాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కోకస్‌మాన్నూర్‌లో ఉద్యమకారుడు, మాజీ సర్పంచ్ పాముల మోతిరాంను కలిసి మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సీఐ సైదారావు సేవలు ప్రశంసనీయం

ఉట్నూర్‌రూరల్: బదిలీపై వెళ్తున్న ఉట్నూర్ సీఐ సైదారావు సేవలు ప్రశంసనీయమని వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, జిల్లా నాయకులు ప్రభాకర్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్‌లు అన్నారు. ఆదిలాబాద్ రూరల్‌కు బదిలీ అవడంతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. నాయకులు సతీశ్, జగ్జీవన్, అంజత్, రవీందర్, బాబా శ్యాం పాల్గొన్నారు.

సన్మానం

తాంసి: కాంట్రాక్ట్ అధ్యాపకుల నుంచి రెగ్యులర్ అధ్యాపకులుగా నియమితులైన అర్లి(టి) గ్రామానికి చెందిన సంతోశ్, రత్నాకర్, ప్రకాష్, వినోద్‌లను గ్రామ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గౌరవ అధ్యక్షుడు, డీఐఈవో రవీందర్, అధ్యక్షుడు ఒమయ్య పాల్గొన్నారు.

బోథ్: ఇటీవల బదిలీపై వెళ్లిన ఇచ్చోడ సీఐ నైలు నాయక్‌ను బోథ్ మండలంలోని పార్డి(బి) రాయి సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఆదివాసీలతో కలిసి ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డైరెక్టర్ భూమన్న, సార్‌మెడి తొడసం లక్ష్మణ్, ఇస్రు, లాలురాం, భీంరావ్, బండు, మారుతి, కిషన్, కాంబ్లే భీంరావ్ పాల్గొన్నారు.

పట్టణప్రగతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

బోథ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన పట్టణప్రగతి వేడుకల్లో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొన్నారు. రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

ఉట్నూర్‌రూరల్: కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఫిర్యాదు చేసిన రైతు సమస్యలు పరిష్కరించాలని, వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఉట్నూర్ డివిజన్ కోఆర్డినేటర్ కుమ్ర వినాయక్ రావు, సిడాం రమేశ్‌లు డీడీ దిలీప్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అటవీ హక్కుపత్రాలు మంజూరు చేసే తరుణంలో రైతుల పేర్లలో తప్పులు సరిచేయాలన్నారు. స్పందించిన డీడీ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ నంది అడెల్లు (49) అనారోగ్యంతో మృతి చెందారు. 1998లో సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన అప్పటి తెలుగుదేశం రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. ఆతర్వాత బీఆర్ఎస్‌లో చేరి పార్టీలోనే కొనసాగుతున్నారు. గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ.. శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఈరోజు..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైలాస్‌నగర్: పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆదిలాబాద్ టౌన్ – 3 ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓల్డ్‌హౌజింగ్ బోర్డు, శాంతినగర్ కుమ్మరివాడ, అటెండర్ కాలనీ, పాలిటెక్నిక్, ఇండ్రస్టియల్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ మండల పరిధిలోని జీఎస్ ఎస్టేట్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్, పొచ్చెర, దిమ్మ, జందాపూర్, భీంసరి, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

తెలంగాణ గిరిజనోత్సవం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం తెలంగాణ గిరిజనోత్సవం నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తామన్నారు.

అంబేద్కర్ భవనం ప్రారంభం

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్‌లో రూ.2 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు పంచాయతీరాజ్ ఎస్ఈ మహవీర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యాలయాన్ని కొత్త భవనంలోకి మార్చాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోథ్: రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని కొత్త భవనంలోకి మార్చాలని బోథ్ నియోజవర్గ బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తూము సూర్యం డిమాండ్ చేశారు. శుక్రవారం నూతనంగా నిర్మించిన రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద మాట్లాడారు. కార్యాలయానికి భవనం నిర్మించినా.. అద్దె భవనంలోనే కొనసాగుతుందన్నారు. రాత్రుల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి శ్రీకాంత్ ముత్యం, జక్క హరికృష్ణ, కుమ్మరి సతీశ్, ప్రకాశ్, సాయిలు పాల్గొన్నారు.

'బైపాస్ రోడ్డుకు భూములు ఇచ్చేదిలేదు'


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

బేల: బేల బైపాస్ రోడ్డుకు వ్యవసాయ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వమని షంషాబాద్, డోప్టాల రైతులు శుక్రవారం మండలంలో షంషాబాద్ శివారులోని చేలలో నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే అధికారులు మండల కేంద్రం నుంచే రెండు వరుసల జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. బైపాస్ రోడ్డు వేస్తే సన్న, చిన్నకారు రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు ప్రభుత్వాలని చెప్పుకుంటూ.. రైతులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో 55ఎకరాల వ్యవసాయ భూమిని కోల్పోయే అవకాశం ఉందన్నారు. పోరాటాలు చేయడానికైనా, చావడానికైనా సిద్ధంగా ఉన్నామని, భూములను ఏమాత్రం ఇవ్వమని తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఉట్నూర్‌రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకువెళ్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం పల్లెపల్లెకు రేఖక్క కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ పరిధిలోని గొట్టి గోండ్‌గూడలో పర్యటించారు. గ్రామంలో కరెంటు సమస్య ఉందని ఎమ్మెల్యేకు గ్రామస్తులు తెలపడంతో వెంటనే పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. ఆమె వెంట ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాంనాయక్, సర్పంచ్ కళావతి, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రషీద్, అజీమొద్దీన్, సీతారాం, కందుకూరి రమేశ్, భరత్, పోశన్న పాల్గొన్నారు.

తాగునీటి కోసం యువకుల శ్రమదానం


బావి పూడిక తీస్తున్న యువకులు

నార్నూర్: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గాదిగూడ మండలంలోని పర్సువాడ గ్రామ పంచాయతీ పరిధిలోని హీరాపూర్ గ్రామానికి చెందిన యువకులు ఐక్యంగా ముందుకు కదిలారు. గ్రామంలో నీటికోసం ఆదివాసీ గిరిజన మహిళలు పడుతున్న ఇబ్బందిని గమనించి బావిలోని పూడిక తీశారు. సర్పంచ్ జంగు సీడాం జంగు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా గ్రామానికి భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. దీంతో యూత్ సభ్యులు శ్రమదానం చేసి బావి పూడిక తీశారని తెలిపారు. గ్రామస్తులకు అండగా నిలిచిన యూత్ సభ్యులను సర్పంచ్ అభినందించారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'


మాట్లాడుతున్న సునీతరావ్

ఇంద్రవెల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల కరపత్రాలు విడుదల చేశారు. జూలై 1 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, జూలై 2న పరీక్ష ఉంటుందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకటేనని ఆరోపించారు. గడిచిన 9 సంవత్సరాల పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే రాష్ట్రంలో అన్నివర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిత్‌ఖాన్, ఆడే గజేందర్, చారులత రాథోడ్, సోమోనే నాగోరావ్, జహిర్, జాదవ్ రాధాబాయి, ముండే లక్ష్మీబాయి పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ మహిళలకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. శుక్రవారం ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ క్విజ్‌పోటీలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అనేక మాయమాటలతో గద్దె నెక్కిన బీఆర్ఎస్, బీజేపీ ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించడం, నిరుద్యోగ భృతి పేరుతో కాలయపన చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో జిల్లా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు, నియోజకవర్గ నాయకులు పెందూర్ ప్రభాకర్, చంద్రయ్య, కలీం పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయాలి


అధికారులతో సమావేశమైన ఓటరు నమోదు అధికారి

బోథ్: బూత్ లెవల్ అధికారులు గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి ఓటరుగా నమోదు చేయాలని బోథ్ నియోజకవర్గ ఓటరు అధికారి, డిప్యూటీ కలెక్టర్ కదం సురేశ్ అన్నారు. స్థానిక రైతువేదికలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మృతిచెందిన వారిని ఓటుహక్కును తొలగించాలన్నారు. మార్పులు, చేర్పులు ఉంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

గ్రామాల్లో ఓటరు చైతన్యయాత్ర

మండలంలోని బాబెరతండా, నిగిని, కంటెగాం గ్రామాల్లో అప్పీల్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి రాథోడ్ పార్వతి శుక్రవారం ఓటరు చైతన్య యాత్ర నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా చేరాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాథోడ్ రవీందర్, జాదవ్‌లక్ష్మి, సుశీల, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గడపగడపకూ కాంగ్రెస్


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

జైనథ్: రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని భోరజ్ గ్రామంలో గడప గడపకూ కాంగ్రెస్ నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, వరంగల్ రైతు డిక్లరేషన్, కాంగ్రెస్ హామీల గురించి ప్రజలకు వివరించారు. అధికారంలోకి వస్తే, రైతులకు రూ. 2లక్షల తక్షణ రుణమాఫీ, రూ. 15వేల రైతుబంధు అందిస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. 18 సంవత్సరాలు దాటిన యువతీ, యువకులకు ఎలక్ట్రిక్ స్కూటీలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు సంజీవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బోథ్: రానున్న రోజుల్లో కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు కొనసాగతాయని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్, ఎల్‌డీపీ కోఆర్డినేటర్ పసుల చంటి అన్నారు. శుక్రవారం మండలంలోని సొనాలలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన నల్ల అరుణరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి, రవళి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, వసుధ, దేవ్‌రావ్‌లు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుర్మె మహేందర్, ఉపాధ్యక్షుడు రామాయి రాము, షేక్ నాజర్ అహ్మద్, గుడాల శేఖర్, అనిల్ పాల్గొన్నారు.